# మరోబొమ్మ

## పాలకోడేటి సత్యనారాయణరావు

**"వెళ్లండి, పర్వాలేదు, ఇక్కడంతా ఇంతే ! —" అన్నాడు రిక్షావాడు, రిక్షా ఆపిన తర్వాత దిగిన భాస్కరంతో.**

భాస్కరం ఒకసారి సంకోచంగా ఆ 'ఇక్కడ' కేసి చూసాడు — మసక మసక వెలుగులను ప్రసరిస్తున్న వీధి లైట్లు, ఎంతో కాలంగా వెల వెల పోయినట్లుగా ఉన్నాయి 'ఇక్కడ' జీవితాలకు ఇంత కన్నా వెలుగు అనవసరం ఏమో అన్నంత నిర్లిప్తంగా అవి వెలుగుతున్నాయి ఆ మసక వెలుగులలో, ఆ మసక చీకట్లలో, ఆ వెలుగుతున్న చీకట్ల మధ్య అక్కడక్కడ .

భాస్కరం కొంచెం ఇబ్బందిగా కదిలాడు మనసు కొంచెం మరీ చిలిపిగా ఇబ్బంది పెట్టింది ఒళ్లంతా చిరు చెమటలు అయినా ఎక్కడి నుంచో తెలీని సన్నని మంటలు

రిక్షావాడు ఇంకోసారి అన్నాడు — ''వెళ్లండి. మీకేం భయం లేదు పోనీ నేను రానా ?''

భాస్కరం భయపడ్డాడు

తన భయాన్ని బలవంతాన్ని కప్పిపుచ్చుకొంటూ అన్నాడు — ''వద్దులే వెళ్లు !'' అని వాడు వెళ్లిపోతున్న భయం తన్ను వెంటాడుతోంటే, త్వర త్వరగా జేబులోంచి రూపాయినోటుతీసి అందించాడు

రిక్షావాడు ఆ నోటు అందుకొని, వెళ్లి పోయాడు

భాస్కరం మరోసారి ఆ వీధిలోకి చూశాడు — అతనికి రెండు రోజుల క్రితం జరిగిన సంఘటన గుర్తొచ్చింది

ఆ రోజు శనివారం భాస్కరానికి శనివారాలు ఉండటం చాల కాలం నుంచి అలవాటు అయి పోయింది భక్తి శ్రద్ధలు, దైవచింతన అంతగా లేకపోయినా వారానికి ఒక పూట జీర్ణకోశానికి కొంచెం విశ్రాంతి ఇవ్వటం మంచిది అనే ఊహతో శనివారాలు సాయంత్రం పూట అభోజనం ఉండటం, వీలుంటే, టైముంటే వెళ్లి ఏ దేవుణ్ణో సందర్శించి రావటం భాస్కరం అలవాటు చేసుకొన్నాడు

భాస్కరం చేస్తున్నది మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగం ఆ ఉద్యోగంలో నియమ నిష్టలతో ఉండటం కష్టమైన పని ఎక్కడ ఏది పడితే అది తిని, ఎలాపడితే అలా ఉండగలిగేవాడు ఆ ఉద్యోగానికి బాగా పనికొస్తాడు భాస్కరం అలాటి ఉద్యోగంలో కూడ సాధ్యమైనంతగా జాగ్రత్తగానే ఉంటున్నాడు శనివారం పూట — తన ఆశయమూ, దైవ భక్తీ కలిసివచ్చేలాగున అభోజనం ఉండటం, దైవ సందర్శనమూ అలవాటు చేసుకొన్నాడు

ఆ రోజు అలాగే ఆంజనేయస్వామి గుడికి వెళ్లి తిరిగివస్తున్నాడు గుడి అంతా రద్దీగా ఉంది. భాస్కరానికి గుడి అంటే ప్రశాంతంగా ఉండాలని పిస్తుంది కానీ గుళ్లో జనం ఉంటే, అదంతా, ఎంతో అలజడి కలిగిస్తుంది భాస్కరానికి మనసంతా ప్రశాంతత బదులుగా అదోరకం ఆందోళన నిండి పోయింది.

పరాకుగా నడుస్తున్నాడు భాస్కరం — తన పక్కనే ఎవరో నడుస్తూ ఉండటం కూడా గమనించగలిగే స్థితిలో లేడతను.

క్షణం తర్వాత — ఎవరో ఏదో అన్నట్లుగా అనిపించి అటుకేసి చూశాడు భాస్కరం తన్ను అంటిపెట్టుకుని ఉన్నట్లుగా ఉన్న అతను నెమ్మదిగా అన్నాడు — ''కావాలా సార్ ? — కొత్త సరుకు .''

భాస్కరానికి ఇలాటి అనుభవం కొత్త. ఆ కొత్తదనం ఇంకా అతనిలో చిలిపిదనాన్ని కలుగజేయలేదు అందుకే అడిగాడు — ''ఏమిటీ ?''

''అమ్మాయి సార్.. చాలా చిన్నది పదిహేడేళ్లే .''

భాస్కరానికి అసహ్యం అనిపించింది - ఛీ — ఇంతకీ వీడు చెప్పేది ఇదా ? ఇంత బహిరంగంగానా ?. . 'దేశమా, ఎక్కడకు పోతున్నావు నువ్వు ? ఆడతనాన్ని ఇంత ఘోరంగా ఇలా బజార్లలో ఛీ !' అని అనుకున్నాడు భాస్కరం

ఆ వ్యక్తికి జవాబు ఇవ్వక నడవసాగాడు భాస్కరం భాస్కరంతో బాటుగా రెండడుగులు వేసిన అతను ఇక లాభం లేదనుకొని ఆగిపోయాడు

భాస్కరం హోటల్ రూంకు చేరుకొన్నాడు అయినా అతని మనసులోంచి ఆ సంఘటన తొలగిపోలేదు


రాత్రి అంతా మనసు మంచి చెడుల మధ్య ఊగిసలాడింది

శరీరం ఆ అనుభవం కోసం ఆక్రోసిస్తోంటే, మనసు అడ్డుపడింది — అతను ఆ రోజు ఎన్నో సంఘర్షణలకు లోనయాడు —

మర్నాడు ఆదివారం. ఆదివారం రోజు ప్రొద్దున్నంతా భాస్కరానికి బోలెడంత పని. డాక్టర్లంతా ఆదివారం ఉదయం అంతా ప్రజల రోగం కుదిర్చి, సాయంత్రాలు మాత్రం తమకోసం కేటాయించుకుంటారు. అందుకని భాస్కరం ఆదివారం ఉదయం ఆ డాక్టరు దగ్గరకు వెళ్లి ఆ మందు కొనమని, ఈ డాక్టరు దగ్గరకు వెళ్లి ఈ మందు కొనమని, డాక్టరు దగ్గర నుంచి డాక్టరు దగ్గరకు రోగం లేకపోయినా తిరుగుతాడు. ఆ తిరుగుడులో ఆతనికి మరే సంగతి గుర్తుండదు — ఎంతసేపూ మంత్లీ రిటర్న్సు, సాంపుల్సు, స్టాటిస్టిక్సూ... బిజినెస్ — ఇంతే — ...

ఆదివారం సాయంత్రం—ఆదివారం సాయంత్రం అతనికి శనివారం సాయంత్రమే గుర్తొచ్చింది. ఆదివారం అంతక్రితం ఎపుడూ వెళ్లకపోయినా మళ్లీ గుడికి వెళ్లాడు. గుళ్లోంచి ఎవరో తరిమేసినట్లుగా తిరిగివచ్చాడు.

తిరిగి వచ్చేటపుడు, నిన్న కనిపించిన 'ఆ వ్యక్తి' కోసం వళ్లంతా కళ్లు చేసుకొని వెదికాడు అయినా లాభం లేకపోయింది. చివరకు నిరాశతో హోటల్ బెడ్‌మీద వాలాడు



కంటి కెదురుగా ఎన్నో ఇబ్బందులు — శరీరం పెడుతున్న కోతలు

మర్నాడు ఎంతో ధైర్యం చేసి రిక్షా ఎక్కాడు. రిక్షా ఎక్కగానే అడిగాడు — "ఏదైనా సరుకు కావాలా!" అని

అలా అడిగీ అడగ్గానే అతనే ఆశ్చర్యపోయాడు, అలా అడిగిందితనేనా ! అని.

రిక్షా కదిలింది —

భాస్కరం వీధిలోకి కదిలాడు — అడుగులో అడుగు వేసుకొంటూ, రాబోయే ఆ అనుభవంకోసం!

ఆ వీధిలోకి నాలుగు అయిదు అడుగులు వేశాడో లేదో కానీ, అతనికి కొంచెం ధైర్యం కలిగింది — మరో నాలుగైదు అడుగులు వేయగానే, అతనికి తలుపు వారల నిలబడ్డ 'కన్య' లు కనబడ్డారు అలా ఇంకొన్ని అడుగులు వేశాడు — అతని మనసంతా హఠాత్తుగా ఖాళీ అయిపోయింది

ఈ వీధిలోకి అతనెందుకు అడుగు పెట్టాడో తలుచుకోగానే అతని వళ్లంతా సిగ్గుతో ముడుచుకుపోయింది — తన రాకకు కారణం అంతమంది స్త్రీలకు తెలిసిపోయిందంటే మరీ ఇబ్బందిగా ఉంది.

— ఇంక ఆ వీధిలో నడవలేకపోయినట్లుగా, అక్కడే ఆగిపోయాడ భాస్కరం

"రండి" — ఎవరో పిలిచారు అతన్ని.

అనాలోచితంగా, అప్రయత్నంగా అటుకేసి నడిచాడు ఆ ఇంటి మెట్లు ఎక్కుతున్నపుడు అతనికి దిగజారిపోతున్నట్లుగా అనిపించింది అతనిలో అరగంట క్రితం చిలిపిగా రేగిన కోరిక ఆనవాలు కూడా అతనిలో ఈ క్షణంలో లేదు

— లోపలికి రాగానే, ఆ స్త్రీ కేసి చూశాడు భాస్కరం ఆమెకు దాదాపుగా ఇరవై, ఇరవై రెండేళ్లు ఉంటాయి మనిషిలో మంచి అందం ఎక్కడో దాక్కొని ఉంది, అది ఆమెలోంచి తొంగి చూస్తోంది కొంటెతనమూ కనిపిస్తోంది

భాస్కరం జేబులోంచి డబ్బు తీశాడు — అతనిలో ఇదంతా ఎవరికోసమో చేస్తున్నట్లుగానే ఉంది

ఆ స్త్రీ, అతని చేతిలోంచి ఓ పది రూపాయల నోటు అందుకొంది భాస్కరం పర్సు మూసేసాడు

"నా పేరు సావిత్రి " అంది సావిత్రి

భాస్కరం వినలేదు అతను ఎదురుగా ఉన్న అద్దంలోకి చూశాడు ఆ నిలువు టద్దంలో అతనికి సావిత్రి కనబడింది — సావిత్రి . ఇరవై, ఇరవై రెండేళ్లు పైట జారింది — జాకెట్ .

భాస్కరంలో వణుకు ప్రారంభం అయింది — అతనికి ఆ అద్దంలో సావిత్రి స్థానంలో అతని భార్య భారతి కనబడింది — భారతి ఆప్యాయంగా, ఆదరంగా, అనురాగంతో తనకేసి చూస్తున్నట్లుగా

"తలుపు తియ్యి! " అన్నాడు భాస్కరంఆత్రుతగా

సావిత్రి ఆశ్చర్యంగా అతనికేసి చూసింది

భాస్కరం ఆగకుండా తలుపు తీశాడు

"వెళ్లిపోతున్నారేం ? —" సావిత్రి ప్రశ్న

— భాస్కరం విసురుగా బయటకు నడిచాడు ఆ వీధిలోంచి పూర్తిగా బయట పడ్డాక దీర్ఘంగా ఒకసారి నిట్టూర్చుకొన్నాడు

కానీ సావిత్రికిభాస్కరంప్రవర్తన అర్థంకాలేదు

భాస్కరం మనసులో మెదలిన ఆ మరో బొమ్మ సంగతి సావిత్రికి తెలిసే అవకాశం లేనేలేదు

# కొత్త సీరియల్ ప్రారంభం!

# పుత్తడి బొమ్మ

శ్రీలు పొంగిన జీవగడ్డ అని లనవసరంగా పిలవబడే దేశం అది పొంగిన శ్రీలన్నీ లక్కడ పొందేది కొందరే ఆ కొందర్ని తీసేస్తే మిగిలిన వాళ్లు ఎందరో నోరులేని గొర్రెలు వాయిలేని గోవులు రోగాల్తో దారిద్ర్యంతో అనునిత్యం క్రుంగి కృశించిపోయే దీనులు ఆ గడ్డమీద ఎన్నెన్నో జాతులు వున్నాయి అక్కడి జాతుల్ని రకరకాలుగా పిలుస్తారు ఒకదాని పేరు మానవజాలి

అందులో మళ్లీ రెండు రకాలు

ఒకటి మగ రెండోది ఆడ

యుగాలు గడిచేయి అప్పటికి

అప్పటికీ — మొదటిదైన మగజాలికి ఆలోచన అంటే అసహ్యం

ఇప్పటికీ — రెండోదైన ఆడదానిని ఆలోచించనిచ్చేరు కారు

*　　*　　*

అన్నిట్లోనీ వెనకబడ్డ శ్రీకాకుళం జిల్లాలోని ఆ మారుమూల వూరిని పార్వతీపురం అంటారు

ప్రపంచంలో ఓ మూల సాగరజలాల్లో యుద్ధ నౌకలు పరస్పరం సంఘర్షించి సంక్షోభం చెలరేగినా, అక్కడున్న నాలుగు సినిమా హాళ్లూ మామూలు రోజుల్లో మూడాటలూ పండగ రోజుల్లో నాలుగాటలూ నిర్విఘ్నంగా రోజూ వేస్తాయి భూగోళం అవతలివేపున యుద్ధోన్మాదులు బాంబుల వర్షాన్నీ మెషీన్ గన్‌ల నాట్యాన్ని అల్లుతూవుంటే, ఇక్కడ కిరాణా, మందుల, బట్టల, కూరగాయల, రకరకాల వ్యాపారాలన్నీ సజావుగా సాగిపోతూంటాయి న్యూయార్క్‌లో పోష్ హోటల్సులో పాశవిక ప్రవృత్తుల పైశాచిక సంతృప్తికోసం స్ట్రిప్‌టీజ్ చేసే అర్ధనగ్న సుందరీమణులు దిగంబరమైన వేళలు, ఇక్కడ పంట కళ్లాల్లోకి తుడుపులకని వెళ్లి కక్కుర్తికి చేరెడు నువ్వులు దొంగిలించి ఖర్మకాలి బుగత గారికో ఆయన కొడుక్కో తమ్ముడికో లేకపోతే ఇంకొకరికో దొరికిపోయి, జాకెట్లు లేని వక్షస్థలాలమీద వారి చేతులు పడితే వేరే దారి లేక మరొకటి చేతకాక వాళ్ల కామదాహం తీర్చే ఆడ కూలీలకి తెలీనే తెలీదు ధరల్ని అదుపులో పెట్టడానికి తిండిగింజల్ని తమలాంటి మనుషులే ఏదో దేశంలో సముద్ర గర్భంలో పడవేస్తున్నారన్న సంగతి తెలుసుకోలేని దరిద్రులు గంజినీళ్లకోసం యిక్కడ కుక్కల్లా కాట్లాడు తూ పోట్లాడుకుంటూ వుంటారు భూవలయంలో ఏదోచోట తల ఎత్తిన సరిహద్దు సమస్య రెండు దేశాల మధ్య సమరం సృష్టిస్తే, ఆ విలయ లయలో నగరాలూ గ్రామాలూ దగ్ధం అయినట్టే బాంబుల పిడుగులు అరణ్యాల్ని తగలెట్టినట్టే అసహాయ పురుషులు ఘోరంగా నరకబడి మృత్యువాత పడ్డట్టే అబలా సమూహం అమానుషంగా చెరచబడ్డట్టే, ఈ ప్రాంతపు కంబార్లూ కూలీలూ భూస్వాముల దౌష్ట్యానికి అప్పుడప్పుడు గురి అవుతూ ఉంటారు అమాయిక స్త్రీలు కామందుల కామ ప్రకోపాలకి నిర్దాక్షిణ్యంగా బలి అవుతూ వుంటారు పెళ్లికాని కన్నెపిల్లలు పిల్ల తల్లులయి నూతుల్లో గోతుల్లో చావు వెదుక్కుంటూ వుంటారు తెల్లజాతి క్రౌర్యానికి నల్లజాతి ఆహుతి అవుతున్నట్లే, ఇక్కడి వెనకబడ్డ జాతి యజ్ఞ సమిధలా హుతమారిపోతూ వుంటుంది

పైగా అప్పటికి దేశంలో — సమ్మెలు సత్యాగ్రహాలు అలజడులు ఆందోళనలు లాఠీఛార్జిలు . అరెస్టులు నోళ్లు తెగిచే జైళ్లు నదీజలాల వివాదాలు సరిహద్దుల తగాదాలు లవినీతి . నిరుద్యోగం లంచగొండితనం దారిద్ర్యం స్తబ్దత నిర్లిప్తత నైరాశ్యం . వైరాగ్యం — పట్టం కట్టుకొని వున్నాయి

ఇంతెందుకు ? ప్రపంచంలో చాలాచోట్ల వున్నట్లే ఈ ప్రాంతంలోనీ అధికార మదోన్మాదం, పూజారుల నల్లమందు మైకం రెండూ కలిసి కట్టుగా, ఐకమత్యంతో మసులుకుంటున్నాయి స్వైర విహారం సలుపుతున్నాయి →